సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 29 । ఆగస్టు । 2024



రాణించిన నెల్లూరు బ్యాట్స్‌మన్

ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. -8లో



ప్రజల్లో విశ్వసనీయత పెంచాలి

పోలీసుశాఖ పట్ల విశ్వసనీయత పెంపొందించేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం
34.0/26.4

వాతావరణం

జిల్లాలో బుధవారం 26.4 – 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వైద్యులు, వైద్య సిబ్బంది భద్రత ..సౌకర్యాలపై 'సాక్షి' క్యాంపెయిన్.

కఠినమైన చట్టాలు అవసరం



వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠినమైన చట్టాలు తీసుకురావాలి. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దాడులకు పాల్పడిన వారికి తక్షణమే శిక్ష పడేలా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. అన్ని సౌకర్యాలు, భద్రత కల్పించినప్పుడే మహిళా వైద్యులు ధైర్యంగా విధులు నిర్వహించగలరు. - రాణెమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి, ప్రొద్దుటూరు

డాక్టర్ల భద్రతపై ప్రభుత్వం దృష్టిసారించాలి



నిస్వార్థసేవలు అందించే వైద్య సిబ్బందిపై విధి నిర్వహణలో భరోసా కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు రూపొందించి అమలు చేయాలి. ఆసుపత్రిలో సీసీ కెమెరాలు, పోలీసు రక్షణ ఉండేలా చూడాలి. దాడులను అరికట్టడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ సెల్‌లను ఏర్పాటు చేసి ఫిర్యాదు రాగానే స్పందించేలా చర్యలు చేపట్టాలి. - కొరివి.నాగరాణి, ఏఎన్ఎం, కొండాపురం

మహిళలకు భద్రత కల్పించాలి



కోల్‌కతాలో మహిళా డాక్టర్ హత్యాచార సంఘటన యావత్ భారత దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు స్పందించి మహిళలకు భద్రత కల్పించాలి. అలాగే ఇలాంటి ఘాతుకాలకు పాల్పడిన వారిని తక్షణం శిక్షించాలి. అప్పుడే మహిళా వైద్య సిబ్బందికి భద్రత, భరోసా ఉంటుంది. -సి. వసంత, హెల్త్ సెక్రటరీ, 2వ సచివాలయం, కమలాపురం

భద్రతా చర్యలు తీసుకోవాలి



ఆస్పత్రుల్లో పనిచేసే చోట వైద్యులపై అత్యాచారాలకు పాల్పడకుండా ప్రభుత్వాలు భద్రతా చర్యలు చేపట్టాలి. వైద్యులకు, మహిళలకు భరోసా కల్పించే విధంగా ప్రత్యేకమైన చట్టాలను తీసుకొచ్చి అమలు చేయాలి. అప్పుడే నిర్భయంగా విధులు నిర్వర్తించగలుగుతారు. - జనార్దన్, హెల్త్ సూపర్‌వైజర్, పీహెచ్‌సీ, జీవీ సత్రం, మైదుకూరు మండలం

న్యూస్‌రీల్

నేడు కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఐటీఐలలో 3వ విడత అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు గురువారం 29వ తేదీ ఉదయం 9 గంటలకు వారు దరఖాస్తు చేసుకున్న ప్రభుత్వ ఐటీఐలలో కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రభుత్వ మైనార్టీ ఐటీఐల జిల్లా కన్వీనర్ జ్ఞానకుమార్ తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఫొటో, ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. అదే విధంగా ప్రైవేటు ఐటీఐలలో సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు 31వ తేదీ ఉదయం 10 గంటలకు వారు దరఖాస్తు చేసుకున్న ఐటీఐలలోనే కౌన్సెలింగ్ ఉంటుందని.. తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటో, ఆధార్ హాజరుకావాలని వివరించారు.

1న అథ్లెటిక్స్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సెప్టెంబర్ 1న ఆదివారం ఉదయం 9.30 గంటలకు బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి అహ్మద్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను సెప్టెంబర్ 14, 15, 16 తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఆసక్తిగల జిల్లాకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలని.. మరిన్ని వివరాలకు 9949686586 నంబరుకు సంప్రదించాలని కోరారు.

జిల్లాకు ఎరువుల రాక

కడప అగ్రికల్చర్: కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెట్ కంపెనీకి చెందిన 928.50 మెట్రిక్ టన్నుల 20.20.0.13, 487.05 మెట్రిక్ టన్నుల 28.28.0 కాంప్లెక్స్ ఎరువులు బుధవారం జిల్లాకు వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రావు తెలిపారు. ఇందులో 737 మెట్రిక్ టన్నుల 20.20.0.13ను, 390 మెట్రిక్ టన్నుల 28.28.0ని ప్రైవేటు డీలర్లకు కేటాయించగా మరో 20 టన్నుల 20.20.0.13ను అలాగే మరో 20 టన్నుల 28.28.0 ఎరువులను కడప మార్క్‌ఫెడ్‌కు తరలించామన్నారు. మిగతా 132.5 మెట్రిక్ టన్నుల 20.20.0.13ను మరో 58.05 మెట్రిక్ టన్నుల 28.28.0ను కడపలోని గోడౌన్‌కు తరలించినట్లు డీఏఓ తెలిపారు. అలాగే మరో 39 మెట్రిక్ టన్నుల 20.20.0.13ను, మరో 19 టన్నుల 28.28.0ను అన్నమయ్య జిల్లాకు కేటాయించనట్లు తెలిపారు. సంబంధిత కాంప్లెక్స్ ఎరువులను రైతులు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని ఆయన ఆదేశించారు.

జాబ్‌డ్రైవ్‌లో ఉద్యోగాలు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో పలువురు విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాల జేకేసీ, హెటిరోల్యాబ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌లో 26 మంది అభ్యర్థులు పాల్గొనగా, 16 మంది అభ్యర్థులు జూనియర్ కెమిస్ట్ ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. జేకేసీ కో-ఆర్డినేటర్ రాము, జేకేసీ మెంటార్లు ఎన్. సారథి, సి.వి.రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

బీఈడీ పరీక్షా కేంద్రాల తనిఖీ



బీఈడీ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న వీసీ, సీఈ

వైవీయూ:యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ పరీక్షలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. బుధవారం కడప నగరంలోని పలు బీఈడీ కళాశాలలను పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా 16 పరీక్షా కేంద్రాల్లో బీఈడీ, ఎంఈడీ ప్రథమ, తృతీయ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఈశ్వరరెడ్డి తెలిపారు.

పచ్చ గద్దలు!

టీడీపీ నేతల భూ దాహానికి చెరువులు మాయమవుతున్నాయి. చూస్తుండగానే ఖాళీ జాగాల్లో కంచెలు లేస్తున్నాయి. కొండలు.. గుట్టలు నిలువునా కరిగిపోతున్నాయి. జాగా కనిపిస్తే చాలు పాగా వేసేందుకు గద్దల్లా వాలిపోతున్నారు. నిబంధనలే కాదు చివరికి న్యాయస్థానాల ఆదేశాలూ పచ్చ నేతల అక్రమాలకు అడ్డుకట్ట వేయడం లేదు.

- యథేచ్ఛగా భూ కబ్జాలకు పాల్పడుతున్న టీడీపీ నేతలు
- ఖాళీ జాగా కన్పిస్తే చాలు స్వాహాకు రంగం సిద్ధం
- సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నా బేఖాతర్... కుచించుకుపోతున్న చెరువులు
- బద్వేల్‌లో కోట్లాది విలువైన చెరువు భూమి ఫ్లాట్‌గా విక్రయాలు



భాకరాపేట చెరువు సమీపంలో కబ్జా చేసేందుకు చదును చేసిన చెరువు పోరంబోకు స్థలం

సాక్షి ప్రతినిధి, కడప: గుట్టలు.. గుంటలు.. వాగులు... వంకలు.. ఏదీ వదలడం లేదు.. ఖాళీ జాగా కన్పిస్తే చాలు కంచెలేస్తున్నారు. పచ్చ గద్దల్లా మారి కబ్జా చేస్తున్నారు. అధికారం అండతో యథేచ్ఛగా స్వాహా చేస్తున్నారు. చివరికి సుప్రీంకోర్టు ఉత్తర్వులు సైతం పెడచెవిన పెడుతూ చెరువులనూ చెరబడుతున్నారు. జిల్లాలో టీడీపీ నేతల కబ్జాపర్వం జోరుగా సాగుతోంది. వెరసి జిల్లాలో వందలాది ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఆక్రమణలకు అడ్డుకట్టగా నిలవాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోంది.

- మైదుకూరు నియోజకవర్గం తిప్పిరెడ్డిపల్లె పరిధిలోని గోడేరు చెరువులో 120 ఎకరాలుండేది. అందులో 50 ఎకరాలు అన్యాక్రాంతమైంది. టీడీపీ కార్యకర్తల కబ్జాలో ఉన్న ఆ భూమిలో యథేచ్ఛగా పంటలు పండించుకుంటున్నారు. అదే గ్రామంలో 30 ఎకరాల్లో ఉన్న వల్లూరమ్మ చెరువు 2 ఎకరాలకు పరిమితమైంది. సర్వే నెంబరు 77లో 4 ఎకరాలు కొండ పోరంబోకు చదును చేశారు. 138/సీలో కుంట పోరంబోకు చెందిన 12 ఎకరాలు సబ్ డివిజన్ చేయించుకొని పాస్ బుక్‌లు కూడా తెచ్చుకున్నారు. సర్వే నెంబరు 742, 743లో గయ్యాళిభూమి సైతం జేసీబీలు పెట్టి చదును చేశారు. తిప్పిరెడ్డిపల్లె పొలం సర్వే నెంబరు 231లో స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు కేటాయించిన భూమిని కూడా టీడీపీ నేతలు చదును చేశారు. చెరువులు, వాగులు, వంకలు అన్యాక్రాంతానికి పాల్పడడం చట్ట విరుద్ధమని, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులున్నాయి. పచ్చ గద్దల భూ దాహానికి అవన్నీ బేఖాతరవుతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగంలో ఎలాంటి చలనం లేకపోవడం ఆశ్చర్యం కల్గిస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోట్లాది విలువైన స్థలాలు సైతం: బద్వేలు మున్సిపాలిటీలో కోట్లాది విలువ గల ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. భాకరాపేట చెరువు సమీపంలోని చెన్నంపల్లె గ్రామ పొలం సర్వే నెంబరు 1581లో చెరువు పోరంబోకు స్థలంలో సుమారు 50 సెంట్లపై టీడీపీ నేతలు కన్నేశారు. అనుకున్నదే తడవుగా జేసీబీతో సదరు స్థలాన్ని చదును చేసి కబ్జాకు రంగం సిద్ధం చేశారు. లక్షలాది రూపాయలు విలువజేసే ఈ స్థలాన్ని కబ్జాకు తెర తీసినట్లు సమాచారం. అలాగే చెన్నంపల్లె గ్రామ పొలంలోని 1581 సర్వే నెంబరులో చెన్నంపల్లె జగనన్న కాలనీకి సమీపంలో సుమారు 75 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు రంగం సిద్ధం చేశారు. ఇక్కడ సెంటు ధర సుమారు రూ.3 లక్షలు పలుకుతోంది.జేసీబీతో స్థలాన్ని చదును చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీకి చెందిన ఓ టీడీపీ ముఖ్య నేత ఈ కబ్జా వ్యవహారంలో కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. మైదుకూరు మండలం జాండ్లవరంలో ఎకరం రూ.20 లక్షలు విలువైన భూమిని తెలుగు తమ్ముళ్లు 86 ఎకరాలు స్వాహా చేశారు. నంద్యాలంపేట రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెంబరు 859లో 16 ఎకరాలు, సర్వే నెంబరు 840లో 70 ఎకరాలు భూమిని ఏకంగా కంచె వేశారు. అలాగే చాపాడు మండలం పల్లవోలు చెరువు సైతం ఆక్రమణకు గురైంది. చెరువు జాగాలను భూములుగా మల్చుకొని స్వాహా చేస్తున్నారు. తమను ఎవరూ ప్రశ్నించరనే ధీమాతోనే టీడీపీ నేతలు యథేచ్ఛగా కబ్జాలకు తెరలేపారని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మేల్కొని అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

కబ్జా భూమి రక్షించుకునేందుకే....

ప్రొద్దుటూరు మండలం చౌడూరు గ్రామంలో గంగమ్మ ఆలయానికి సంబంధించిన 5.47 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. చాలా ఏళ్లుగా ఈ ఆలయం నిర్వహణ గ్రామానికి చెందిన సుబ్బయ్య కుటుంబీకులు చేపట్టేవారు. కాలక్రమేణా భూ రికార్డులో పేరు మార్చి హస్తగతం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో ఆర్డీఓ శ్రీనివాసులు ఈ భూమిని దేవదాయశాఖకు చెందినదిగా తేల్చారు. ఎలాగైనా ఆ భూమిని దక్కించుకోవాలన్న దిశగా అడుగులు వేస్తున్నారు. అధికారపార్టీ నేతల సహకారంతో రికార్డులు మార్చిడికి యత్నిస్తున్నట్లు సమాచారం. కొండాపురం మండలం దత్తాపురం సి-బ్లాక్‌లోని బుక్కపట్నం కాలనీలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు టీడీపీ నేతలు పోటీపడ్డారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. ముందుగా తాను కంచె ఏర్పాటు చేస్తే తర్వాత మీరొచ్చారంటూ తెలుగుతమ్ముళ్ల మధ్య ఘర్షణకు దారితీసింది.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పటిష్టం చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శివశంకర్ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల భద్రతా కమిటీ, జిల్లా విపత్తుల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ కల్పించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు జిల్లా స్థాయి కమిటీలో పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, ఫ్యాక్టరీస్, కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.రెడ్ కేటగిరీలో ఉన్న పరిశ్రమల్లో తగిన రక్షణ, భద్రత కల్పించేందుకు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొటోకాల్ చర్యలను ఖచ్చితంగా పాటించాలన్నారు. జిల్లాలో మొత్తం 1092 రిజిస్టర్డ్ ఫ్యాక్టరీలు నడుస్తున్నాయని, అందులో దాదాపు 33,206 మంది కార్మికులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులకు విధి నిర్వహణలో భద్రత కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, ఆర్డీఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

జిల్లాలో మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి పిలుపునిచ్చారు. సెప్టెంబరు 9 నుంచి 23వ తేది వరకు జరగనున్న మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు.

శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణ

శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో వినాయక ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు శాంతి కమిటీ సభ్యులు సమన్వయ సహకారాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై.. బుధవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాల్ లో శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ తోపాటు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు హాజరై పలు సూచనలు చేశారు.

చెత్త ఘటన దారుణం

- మేయర్ ఇంట్లో చెత్తవేసిన వారిని అరెస్ట్ చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి
- ఎస్పీని కలిసిన వైఎస్ఆర్ సీపీ నేతలు



ఎస్పీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి

కడప అర్బన్: కడప మేయర్ కె. సురేష్‌బాబు ఇంట్లో చెత్త వేసిన సంఘటన చాలా దురదృష్టకరమని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యులైన వారిని అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం ఆయన వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో పాటు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి కడపలోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకున్నారు. ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజును కలిసి ఫిర్యాదు చేశారు. ఎస్పీని కలిసిన వారిలో మాజీ డప్యూటీ సీఎం ఎస్‌బీ అంజాద్ బాషా, కడప మేయర్ కె. సురేష్‌బాబు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే సుధా, వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు ఉన్నారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కడప చరిత్రలో ఇలాంటి సంఘటన ఎప్పుడూ జరగలేదన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డే మేయర్ సురేష్‌బాబు ఇంటిపై చెత్తను వేయించారని ఆరోపించారు. ఎన్నికల వరకే పార్టీలు ఉంటాయని.. ఎన్నికలు ముగిశాక పార్టీలకతీతంగా ఉండాలన్న విషయాన్ని మరవకూడదని సూచించారు. చెత్త నిర్వహణ అనేది మున్సిపల్ కార్పొరేషన్‌దే నన్నారు. స్థానిక సంస్థల్లో కెపాసిటీ లేనపుడు నిధులు కేటాయించి నడపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ప్రజల మెప్పు కోసం చెత్త యూజర్ ఛార్జీలు తీసేశామనీ చెప్పారన్నారు. చెత్త యూజర్స్ తీసినప్పుడు ప్రభుత్వమే స్థానిక సంస్థల అభివృద్ధిని భరాయించాలన్నారు. టీడీపీ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడం కోసం కార్పొరేటర్లు, మేయర్ మీద అనవసర ఆరోపణలు చేయడం సరికాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు.

కలమల్లకు తెలుగు వెలుగు

- తెలుగు భాషా దినోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు
- తెలుగు శాసనానికి శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటుకు భూమి పూజ
- ఉత్సవాలకు హాజరుకానున్న ప్రముఖులు, ప్రజాప్రతినిధులు



కలమల్లలో తెలుగుభాషా దినోత్సవాల కోసం ఏర్పాటు చేసిన శిబిరం

ఎర్రగుంట్ల: మండల పరిధిలోని కలమల్ల గ్రామానికి కొత్త వెలుగొచ్చింది. తొలి తెలుగు శాసనం లభించిన ఈ ఊరిలో తెలుగు భాషా దినోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. గురువారం నిర్వహించనున్న ఈ వేడుకలకు స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తెలుగు భాషా దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్ శివశంకర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సభ్యులు ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక గ్రానైట్ రాళ్లతో చప్టను వేశారు. అంతేకాక తెలుగు శాసనానికి శాశ్వత ప్రాతిపదికన కోసం భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలతో కలమల్ల గ్రామ చరిత్ర ..కీర్తి ప్రతిష్టలు నలమూలలా విస్తరించనున్నాయి. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు రానున్నారు. అలాగే క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం ఉంటుంది.

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం

ఈ ఉత్సవాలకు ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారులు రానున్నారు. ఈ మేరకు కలమల్ల ఎస్ఐ తిమోతి అన్ని భద్రత ఏర్పాట్లు చేశారు. అలాగే ఆర్టీపీపీ రోడ్డుకు వెళ్లే శ్రీ అంకాలమ్మ దేవాలయ సమీపంలోని ఖాళీ స్థలంలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు.

నేడు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రాక

కలమల్లలో జరిగే తెలుగుభాష దినోత్సవాలకు ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు రానున్నారు. గురువారం ఉదయం 6 గంటల 20 నిమిషాలకు హైదరాబాదులోని రాజీవ్‌గాంధీ విమానాశ్రయం నుంచి బయలుదేరి 7.45కు తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు, అక్కడ నుంచి రోడ్డు మార్గాన రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకోంటారు. 9.20 గంటలకు రేణిగుంట నుంచి రైలులో బయలుదేరి మధ్యాహ్నం 11.35కు యర్రగుంట్ల రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. 11.45కు రోడ్డు మార్గాన బయలుదేరి మధ్యాహ్నం 12.15కు కలమల్లకు చేరుకుంటారు. కార్యక్రమాల అనంతరం 1.30 నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 2 గంటలకు ఎర్రగుంట్లలోని గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. సాయంత్రం 5 గంటలకు తిరుగుపయనమవుతారు.

శిక్షలు కఠినంగా ఉండాలి



వైద్యులపై, మహిళలపై నేరాలకు పాల్పడే వారికి వేసే శిక్షలు కఠినంగా ఉండాలి. అప్పుడే ఎలాంటి దురాగతాలు జరగకుండా ఉంటాయి. కోల్‌కతాలో జరిగిన సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలి. వైద్యులకు రక్షణ కల్పించాలి. – డాక్టర్ కె.శ్రీలలిత, గైనకాలజిస్ట్, ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం, మైదుకూరు

మెరుగైన వసతులు కల్పించాలి



ఆసుపత్రిలో వందలాది మంది స్టాఫ్ నర్సులు, మహిళా వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పనిచేస్తున్నారు. పనిచేసే ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు భద్రత ఏర్పాటు చేయాలి. వైద్యులు, సిబ్బందిపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి. – ఎస్.స్వరూప, స్టాఫ్ నర్సు, సింహాద్రిపురం మండలం



చట్టాలు పక్కాగా అమలు చేయాలి



ఉన్న చట్టాలతో పాటు దోషులకు సత్వరం శిక్షలు పడేలా చట్టాలను బలోపేతం చేయాలి. అప్పుడే ఉద్యోగులలో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ఫలానా దోషికి ఫలానా శిక్షపడింది అనే ప్రచారం కూడా జరిగితే కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటనలు పునరావృతం కావు. – లతా, ల్యాబ్ టెక్నీషియన్. అట్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం. అట్లూరు మండలం

భద్రత కట్టుదిట్టం చేయాలి



ఇటీవల కోల్‌కతాలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఆసుపత్రుల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, ఏఎన్‌ఎంలకు అండగా నిలవడంతో పాటు అన్ని వసతులు కల్పించి రక్షణ కల్పించాలి. నేరాలకు పాల్పడిన వారిని వెంటనే కఠినంగా శిక్షించే విధంగా ఉండాలి. ఆ శిక్షలను చూసి మరొకరు ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ఉండాలి. – హన్నమ్మ, ఏఎన్ఎం, జమ్మలమడుగు.

క్లుప్తంగా

రేపు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్

కడప సెవెన్‌రోడ్స్ : గ్రేడ్–2 ఇంజినీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి తన కార్యాలయంలో ప్రారంభమవుతుందని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు జీవీ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కడప జిల్లా పరిధిలో బ్యాలెన్స్ పద్ధతిలో బదిలీలు జరుగుతాయన్నారు. ఇప్పటికి 610 సచివాలయాల పరిధిలో 135 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మీచువల్, స్పౌజ్, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్న ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తామన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో విద్యార్థిని ప్రతిభ



బి.వనిత

ప్రొద్దుటూరు : స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ కంప్యూటర్ సైన్స్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బి.వనిత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ప్రతిభ చూపిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వరరావు బుధవారం తెలిపారు. బెంగళూరుకు చెందిన కీమో సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంపై దేశ వ్యాప్తంగా నిర్వహించిన డిజిటల్ పోటీ పరీక్షలో బి.వనిత పాల్గొని ప్రతిభ చూపి మొదటి స్థానాన్ని కై వసం చేసుకుందన్నారు. విద్యార్థిని వనితను కళాశాల చైర్మన్ హుస్సేన్‌రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సిద్దేశ్వరరెడ్డి, ఉద్యోగ నియామక అధికారి నజీర్ హుస్సేన్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

– సచివాలయాలను తనిఖీ చేసిన జేసీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : సచివాలయ సిబ్బంది ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సూచించారు. బుధవారం కడప నగరంలోని పలు సచివాలయాలలో జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు స్థానికంగా అందుబాటులో ఉంటున్న సచివాలయ సిబ్బంది నిక్కచ్చిగా విధులు నిర్వర్తించాలన్నారు. మీ పరిధిలోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, మీ పరిధిలో లేనివి సంబంధిత శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాలని సూచించారు.

సీమ భాషా సాహితీవేత్తలకు అన్యాయం

- నన్నెచోడునికి దక్కని ఆదికవి హోదా
- బ్రౌన్‌కు పాఠ్యాంశాల్లో దక్కని చోటు
- పుట్టపర్తికి దక్కని జ్ఞానపీఠం
- కట్టమంచిని విస్మరించిన ప్రభుత్వం
- ఓట్ల రాజకీయాలకు పెద్దపీట



కడప సెవెన్‌రోడ్స్ : తొలి తెలుగు శాసనం లభించిన ఎర్రగుంట్ల మండలం కలమల్లలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి నిర్ణయించడం ఎంతో ముదావహం. గతంలో ఎవరికీ రాని ఇలాంటి ఆలోచన కలెక్టర్‌కు రావడం అభినందించాల్సిన విషయం. ఈ నిర్ణయం పట్ల జిల్లాలోని తెలుగుభాషాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే సందర్భంలో రాయలసీమ భాషా సాహితీవేత్తలకు తరాలుగా జరుగుతున్న అన్యాయాన్ని పలువురు సాహితీవేత్తలు ఎత్తి చూపుతున్నారు. అదేమిటో చూద్దాం..

నన్నెచోడుడు

కడపజిల్లా పొత్తపినాడుకు చెందిన కవి. కుమారసంభవం అనే కావ్యాన్ని రాశారు. కాళిదాసు రచనలోని ఇతివృత్తాన్ని మాత్రమే తీసుకుని రాశారు. తెలుగు సాహిత్య రంగంలో నన్నయ్య కన్నా ముందువాడైన నన్నె చోడుడు 925–40 మధ్యకాలం వారని తెలుస్తోంది. నన్నెచోడుడు రాసిన కుమార సంభవం కావ్యాన్ని కనుగొని పరిష్కరించి వెలుగులోకి తీసుకొచ్చిన ఘనత సుప్రసిద్ధ సాహితీ పరిశోధకుడు, కవి, సంస్కృతాంధ్ర పండితుడు, బహుభాషా కోవిదుడైన మానవల్లి రామకృష్ణ కవికి దక్కుతుంది. అప్పటివరకు తెలుగు సాహిత్యంలో నన్నెచోడుడు అనే కవి ఉన్నారనే విషయమే ఎవరికీ తెలియదు. తంజావూరులోని సరస్వతి మహల్ గ్రంథాలయంలో ఒక మూలపడి ఉన్న కుమార సంభవం తాళపత్ర గ్రంథాన్ని రామకృష్ణ కవి కనుగొన్నారు. దాన్ని పరిష్కరించి 1909లో ప్రకటించారు. నన్నెచోడుడు నన్నయ్య కంటే ముందువాడని శాసనాధారాలతో ప్రకటించారు. రామకృష్ణ కవి చేసిన ప్రతిపాదన పండిత లోకాన్ని ఎంతో ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ ప్రతిపాదనపై చర్చోపచర్చలు, వాదోపవాదాలు వాడిగా వేడిగా జరిగాయి. చిలుకూరి వీరభద్ర రావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, జయంతి రామయ్య పంతులు, పింగళి లక్ష్మీకాంతం, నిడదవోలు వెంకటరావు, ఆరుద్ర మొదలైన వారు దీన్ని వ్యతిరేకించారు. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ, పుట్టపర్తి నారాయణచార్యులు వంటి వారు మానవల్లి ప్రకటనను సమర్థించారు. మల్లంపల్లె సోమశేఖరశర్మ సరసన చెప్పుకోదగ్గ ప్రముఖ శాసన పరిశోధకులు, హైదరాబాదుకు చెందిన బీఎన్ శాస్త్రి కుమార సంభవంపై పరిశోధన చేసి నన్నయ్య కన్నా నన్నెచోడుడే ముందు వాడని శాసన ఆధారంగా నిరూపించారు. కందుకూరి వీరేశలింగం రాసిన ఆంధ్ర కవుల చరిత్రలో ఈ విషయానికి సంబంధించిన శాసనం ఉందంటూ పేర్కొనడం విశేషం. నన్నయ్యకే ఆదికవి హోదా దక్కాలనే కోస్తా ప్రాంతానికి చెందిన సాహితీవేత్తల అభిప్రాయానికే ప్రభుత్వాలు విలువనిచ్చాయి. నన్నెచోడుడికి ఆది కవి హోదా లభించక ఈ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగింది.

కట్టమంచి

ఆధునిక సాహితీ విమర్శకు ఆద్యుడు, ప్రతిభావంతుడైన సాహితీవేత్త, వక్త, ఆర్థిక శాస్త్రవేత్త, హేతువాది, రాజనీతిజ్ఞుడు కట్టమంచి రామలింగారెడ్డి. కవిత్ర తత్వ విచారణ, అర్థశాస్త్రం, ముసలమ్మ మరణం ఆయన రాసిన గ్రంథాల్లో ఎంతో పేరు గాంచాయి. మైసూరు రాజ్య విద్యాశాఖ అధికారిగా ఉన్న సమయంలో దళితులకు విద్యావకాశాలు కల్పించారు. ఆయన ప్రణాళిక ఆధారంగానే మైసూరు విశ్వవిద్యాలయం రూపుదిద్దుకుంది. ఆ తర్వాత రాజకీయాల్లో ప్రవేశించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా పనిచేశారు. ఆంధ్రులకు ఒక విశ్వవిద్యాలయం ఉండాలంటూ నాటి మద్రాసు శాసనసభలో ఎన్నో ప్రసంగాలు చేశారు. ఆయన కృషితో ఏర్పడిన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి మొదటి ఉప కులపతిగా పనిచేశారు. కానీ ఆయన్ను నేడు అనుకునే దిక్కే లేదు.

సీపీ బ్రౌన్

తెలుగు భాషా సాహిత్యాల సముద్ధరణకు జీవితాంతం అవిరళ కృషి చేసిన మహనీయుడు సీపీ బ్రౌన్. తాళపత్ర గ్రంథాలు, కావ్యాలు, శతకాలు, వేమన పద్యాలను సొంత ఖర్చులతో సేకరించారు. పండితులకు సొంతంగా జీతాలు ఇచ్చి శుద్ధ ప్రతులను కాగితాలపై రాయించారు. కొన్నింటికి వ్యాఖ్యానాలు రాయించి ముద్రించారు. వేమన పద్యాలను ఆంగ్లంలోకి అనువదించి తెలుగు కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు. తెలుగు వ్యాకరణం, నిఘంటువులు, నిత్యం పరిపాలన వ్యవహారాల్లో ఉపయోగించే రెవెన్యూ జ్యుడిషియల్ పదజాలాన్ని సేకరించి నిఘంటువు తయారు చేశారు. ఆయన కృషి లేకపోతే నేడు తెలుగు భాషా సాహిత్యాలు ఈ స్థితిలో ఉండేవి కావు. అలాంటి మహానుభావుడి గురించి పాఠ్యాంశాల్లో చేర్చకపోవడం విచారకరం. సీపీ బ్రౌన్ పేరిట కనీసం పురస్కారాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఈ ప్రాంత సాహితీవేత్తలు కోరుతున్నారు.

పుట్టపర్తి

శ్రీకృష్ణ దేవరాయల రాజగురువు తాతాచార్యుల వంశానికి చెందిన పుట్టపర్తి నారాయణాచార్యులు కడప నగరానికి చెందిన వారు. ఆధునిక మహాకావ్యంగా పలువురు పండితులు అభివర్ణించే శివతాండవం సృష్టికర్త. జనప్రియ రామాయణం, మేఘదూతం వంటి గేయ కావ్యాలు రాశారు. అనేక భాషలు తెలిసిన వ్యక్తిగా పీవీ నరసింహారావు పేరు మారుమోగుతోంది గానీ పుట్టపర్తి పేరు అంతగా వినిపించదు. తుళు, ఫ్రెంచ్, పర్షియన్, అవధీ, బ్రజ్, కన్నడ, మళయాళ, మరాఠి, సంస్కృతం, ఇంగ్లీషు వంటి 14 భాషల్లో పాండిత్యం సాధించిన దిట్ట పుట్టపర్తి. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీకృష్ణ దేవరాయల విశ్వవిద్యాలయం ఆయనకు డి.లిట్ ప్రదానం చేశాయి. భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని అందించింది. నిజానికి ఆయన జ్ఞానపీఠ అవార్డుకు అర్హులు. కడపలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన డాక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ 'నిజానికి తనకన్నా ముందే నారాయణాచార్యులకు జ్ఞానపీఠం రావాల్సి ఉండేది' అన్నారు. పుట్టపర్తి ముక్కుసూటి మనిషి. లాబీయింగ్ చేయడం చేతగాదు గనుకే ఆ పురస్కారం ఆయనకు దక్కలేదని ఈ ప్రాంత సాహితీవేత్తల అభిప్రాయం.

ఓట్ల రాజకీయాలకు పెద్దపీట

ప్రతిభావంతులైన భాషా సాహితీవేత్తలను గుర్తించి పురస్కారాలను అందించడం ద్వారా గౌరవించని ప్రభుత్వాలు ఓట్ల రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నాయి. రాయలసీమలో ఎంతోమంది ప్రజ్ఞావంతులు ఉన్నప్పటికీ గుర్తింపు లేకుండా పోయింది. డబ్బు, కులం, ఓట్లు తదితర అంశాల ప్రాతిపదికగానే పురస్కారాలు ప్రదానం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ పథకాలకు కూడా రాయలసీమ ప్రముఖుల పేర్లు పెట్టడం లేదు. తెలుగు సంస్కృత అకాడమికి కట్టమంచి రామలింగారెడ్డి పేరు పెట్టాలనే డిమాండ్ చాలాకాలంగా ఉన్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ అంశంపై దృష్టి సారించి ఇప్పటికైనా న్యాయం చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

'సీమ'పై వివక్ష తగదు



నన్నెచోడుడు నన్నయ్య కన్నా ముందువాడనే వాదనపై ప్రభుత్వం ఒక నిపుణుల కమిటీ నియమించి నిగ్గు తేల్చాలి. ఇందుకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని కేంద్ర స్థానంగా చేసుకోవాలి. అన్నమయ్యలోని సంఘ సంస్కరణ భావాలు, ఆయన స్థానిక పద ప్రయోగాలు, తిరుగాడిన స్థలాలు వంటివి పరిశోధించడానికి ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలి. నాచన సోముని వంటి అనేక మంది రాయలసీమ కవులకు గుర్తింపు లేకుండా పోయింది. వేమన, పోతులూరి వీరబ్రహ్మం ప్రాచీన కాలంలో సంఘ సంస్కరణ కవులు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వీరి సాహిత్యం మీద పరిశోధనలను ప్రోత్సహించాలి. కట్టమంచి, పుట్టపర్తి లాంటి వారికి ఏమాత్రం గుర్తింపు లేకుండా పోయింది. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని రాయలసీమలోనే గొప్ప పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయాలి. భాషా పరిశోధకులు, నిఘంటువు నిర్మాతలు, కావ్య పరిష్కర్తలు, వ్యాఖ్యాతలకు సీపీ బ్రౌన్ పేరిట పురస్కారాలు అందించాలి. తొలి తెలుగు కవయిత్రి మొల్ల, తాళ్లపాక తిమ్మక్క, తరిగొండ వెంగమాంబలకు గుర్తింపు వచ్చేటట్లు పరిశోధనలు ప్రోత్సహించాలి. – రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, అధికార భాషా సంఘం మాజీ సభ్యులు

నన్నెచోడుడే ఆది కవి



నన్నెచోడుడు 940 ప్రాంతం వాడని, నన్నయ్య కంటే ముందు తరం వాడని మానవల్లి రామకృష్ణ కవి ఆధార సహితంగా నిరూపించారు. ఆయనకు లభించిన కర్ణాటకలోని కుడుంబలూరు శాసనం, శుద్ధ ద్రావిడ దేశంలో లభించిన బీచుపల్లి శాసనం, పేరు తెలియని మరొక తెలుగు శాసనం ద్వారా ఆయన ఈ నిరూపణ చేశారు. దీన్ని కోస్తా ప్రాంత సాహితీవేత్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. కొర్లపాటి శ్రీరామమూర్తి మరో అడుగు ముందుకేసి కుమార సంభవం నన్నెచోడుడు రచన కాదని, అది మానవల్లి రామకృష్ణ కవే రచించి నన్నెచోడుని పేరు ప్రకటించారనే తీవ్ర ఆరోపణలు చేశారు. రామకృష్ణ కవి నన్నయ్యను ఆదికవి హోదా నుంచి తప్పించి నన్నెచోడుడు ఆ స్థానంలో కూర్చోబెట్టే ప్రయత్నంగానే కుమార సంభవాన్ని రాశాడని నిరాధార ఆరోపణలు చేశారు. కోస్తా ప్రాంత సాహితీవేత్తలకు తొలి నుంచి రాయలసీమ అంటే గిట్టని తనమే ఇందుకు కారణమని భావించవచ్చు. నన్నెచోడునికే ఆది కవి హోదా దక్కాలి. – డాక్టర్ పొదిలి నాగరాజు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల, కడప

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బాబాజాన్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని అమృతానగర్‌లో షేక్ బాబాజాన్ (37) అనే పెయింటర్ విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎర్రగుంట్ల మండలం చిలంకూరుకు చెందిన బాబాజాన్ పదేళ్ల క్రితం ప్రొద్దుటూరు మండలంలోని అమృతానగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. ఆయనకు భార్య హసీనా తోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాబాజాన్ పెయింటింగ్ పనితోపాటు కూలి పనికి వెళుతుంటాడు. బుధవారం అమృతానగర్‌లో ఓ ఇంటి గృహ ప్రవేశానికి అతను వెళ్లాడు. మిద్దెపైన షామియానా కట్టేందుకు ఇనుప పైపులు తీసుకెళుతున్న సమయంలో విద్యుత్ లైన్ తగిలి కరెంట్ షాక్ కొట్టింది. దీంతో బాబాజాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య హసీనా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మహ్మద్ రఫి తెలిపారు.

తెలుగును అవమానిస్తున్న అధికార భాషా శాఖ

కడప ఎడ్యుకేషన్ : సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం అధికార భాషా శాఖ హోమ్ వ్యవహారాల మంత్రిత్వశాఖ న్యూఢిల్లీ వారిని తెలుగులో సమాచారం కావాలని కోరితే వారు హిందీ లేదా ఇంగ్లీషులో మాత్రమే సమాచారం అడగండి అని చెప్పటం రాజ్యాంగ విరుద్ధమని, ఇది తెలుగుబాషను అవమాన పరచడమేనని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శిగంగా సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కడపలోని రారా గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రాచీన హోదా కలిగిన తెలుగు భాషలో దరఖాస్తును తిరస్కరించడం దారుణమన్నారు.

రాణించిన నెల్లూరు బ్యాట్స్‌మన్



సోహన్ వర్మ, నెల్లూరు (92 పరుగులు)



రోహిత్ రోషన్ అనంతపురం (74 పరుగులు)



మల్లికార్జున అనంతపురం (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. ఇందులో భాగంగా గురువారం వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నెల్లూరు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 80 ఓవర్లలో 280 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సోహన్ వర్మ 92 పరుగులతో నాటౌట్‌గా నిలువగా, మాధవ్ 54 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు రెడ్డిప్రకాష్ 3, అచ్యుతానంద 2, జావిద్ 2, బ్రహ్మసాయితేజారెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 22 పరుగులు చేసింది. జట్టులోని శశాంక్ శ్రీవత్స 10 పరుగులతో క్రీజులో నిలిచాడు.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు 55.2 ఓవర్లలో 182 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మహేంద్రయాదవ్ 47 పరుగులు, సాయికృష్ణసింగ్ 42 పరుగులు చేశారు. అనంత బౌలర్లు మల్లికార్జున 5 వికెట్లు, దీపక్ 2, లోహిత్‌సాయి 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 32 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్ రోషన్ 74 పరుగులు, యోగానంద 52 పరుగులు చేశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

ఆంగ్ల ఉపాధ్యాయులు గ్రామీణ విద్యార్థుల భవిష్యత్ మార్గదర్శకులు

వైవీయూ ఆంగ్లశాఖ వర్క్‌షాప్‌లో వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ : గ్రామీణ విద్యార్థుల భాషా నైపుణ్యాలు పెంపొందించగలిగితే ప్రపంచ పోటీలో దీటుగా నిలబడతారని ఆ దిశగా ఆంగ్ల భాష ఉపాధ్యాయులు కృషి చేయాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూ ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో ఆంగ్ల భాష నైపుణ్యాలు, ఉన్నత పాఠశాల స్థాయిలో బోధన విధానాలపై విశ్వవిద్యాలయంలో వర్క్‌షాప్ సమన్వయకర్త డాక్టర్ ఆర్.వి. జయంత్ కశ్యప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఆంగ్లభాషా ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు చిన్న చిన్న పదాలతో ప్రారంభించి ఆంగ్ల భాష పట్ల ఆసక్తిని పెంచాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన హైదరాబాద్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజ్ విశ్వవిద్యాలయం (ఇఫ్లూ) రిజిస్ట్రార్ ఆచార్య కేదారి నరసింహారావు మాట్లాడుతూ ఆంగ్ల భాష ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలన్నారు. సమకాలీన, సామాజిక, ఉద్యోగ అవకాశాలు అందుకునేలా విద్యార్థులకు ఆశావహ దృక్పథం కల్పిస్తూ, సమర్థవంతమైన తర్ఫీదునివ్వాలన్నారు భాషా బోధన చేసే సమయంలో భాష పట్ల జిజ్ఞాసను, ప్రశ్నించే తత్వాన్ని విద్యార్థుల అలవాటుగా మార్చాలన్నారు. మరో విశిష్ట అతిథి ఇఫ్లూ ఆచార్యులు ఆర్. కిషోర్ కుమార్ మాట్లాడుతూ శిక్షణలో పొందిన జ్ఞానాన్ని తరగతి గదిలో విద్యార్థికి చేరువైనప్పుడు సత్ఫలితాలు వచ్చినట్లన్నారు. ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య మెర్సీవిజేత మాట్లాడారు. సాయంత్రం జరిగిన ముగింపు సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రపంచస్థాయి భాష అయిన ఆంగ్ల భాష ఉపాధ్యాయులు అదే స్థాయిలో బోధన నైపుణ్యాలు ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవాలన్నారు. ఉప ప్రధానాచార్యులు ఆచార్య పి. పద్మ, ఆర్ట్స్ విభాగ డీన్ ఆచార్య కె. గంగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఆంగ్ల శాఖ బోర్డ్ ఆఫ్ చైర్మన్ డాక్టర్ నాగుల అంకన్న, అధ్యాపకులు పి. చిట్టిబాబు, డాక్టర్ వై. హరిబాబు, స్కాలర్లు సారిక, మోహన్, భవాని, హిమబిందు, పుష్పాంజలి, వివిధ ప్రభుత్వ పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వసనీయత పెంచాలి

నేర సమీక్షలో జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



కడప అర్బన్ : పోలీసుశాఖ పట్ల విశ్వసనీయత పెంపొందించేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పోలీస్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించేవారిపై విస్తృతంగా తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేయాలన్నారు. ఇటీవలి కాలంలో బహిరంగ మద్యపానంపై నిఘాతో నేరాల శాతం బాగా తగ్గడంతో పాటు ప్రజల నుంచి డయల్ 100కు వచ్చే ఫిర్యాదులలో గణనీయమైన తగ్గుదల నమోదైందన్నారు. సమాజంలో నేరాల శాతం తగ్గినప్పుడు ప్రజలు తాము సురక్షితంగా ఉన్నామనే భావన కలుగుతుందన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి దాడులు చేయాలని ఆదేశించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లోని కాలనీలను సందర్శిస్తూ ప్రజలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి ఆయా ప్రాంతాలలోని ప్రజల నుంచి సమాచారం తీసుకుని దాడులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని దోచుకోవడానికే రివర్స్ టెండరింగ్ విధానం రద్దు



పి. రవీంద్రనాథ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

వల్లూరు : టెండరింగ్‌లో అత్యంత పారదర్శకతను పాటించి ఏ ఒక్క రూపాయి ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా చూడడమే ప్రధాన ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చిందని, ప్రజా ధనాన్ని అడ్డంగా దోచుకోవడానికే ఆ విధానాన్ని టీడీపీ ప్రభుత్వం తొలగించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ రెడ్డి విమర్శించారు.బుధవారం వైఎస్సార్‌ఆర్ జిల్లా కేంద్రం కడపలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రివర్స్ టెండరింగ్ విధానాన్ని అమలు చేయడం ద్వారా ఎక్కువ మంది టెండర్లలో పాల్గొనేలా చేసి, దాని వల్ల ఏ పనిలో ఎంత ప్రజా ధనం ఆదా అయిందనే విషయాన్ని ప్రజల ముందుంచుతామని ప్రమాణ స్వీకారం చేసిన రోజే నాటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించారని అన్నారు. దేశంలోనే అలాంటి వ్యవస్థను తీసుకొచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని పేర్కొన్నారు. ప్రజా ధనాన్ని ఆదా చేయడంలో చక్కటి ఫలితాలను అందిస్తున్న రివర్స్ టెండరింగ్ విధానాన్ని రద్దు చేయాలని చంద్రబాబు మంత్రివర్గం నిర్ణయించడం దారుణమని అన్నారు. ఈ నిర్ణయం అవినీతితో ప్రజా ధనాన్ని దోచుకోవడానికి గేట్లు తెరవడమేనని అన్నారు. టెండర్లలో ఎక్కువ మంది పాల్గొనేలా చేసి పోటీని పెంచే రివర్స్ టెండరింగ్‌లో సిండికేట్ అవుతారో, తక్కువ మంది పాల్గొనే సాధారణ టెండరింగ్‌లో సిండికేట్ అవుతారో సీఎం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. టెండర్ల ఖరారు సమయంలో ఒక సీనియర్ న్యాయమూర్తికి ప్రివ్యూ కోసం పంపితే అవినీతి తగ్గుతుందో లేక పాత పద్ధతిలో పర్యవేక్షణ లేకుండా టెండర్లను ఖరారు చేస్తే అవినీతి తగ్గుతుందో ఆయన తెలపాలని అన్నారు.

లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో 476 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. బుధవారం కడపలో ఆయన మాట్లాడారు.